నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, బుధవారం 15 మే 2024 | NAGARKURNOOL


గద్వాల నియోజకవర్గంలో సోమవారం ఓటేసేందుకు బారులుదీరిన ప్రజలు

# పెరిగిన పోలింగ్

- గతంతో పోల్చితే 7.13 శాతం అదనం..
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో గద్వాలలో అత్యధికం
- ఫలించిన ఎన్నికల సంఘం చర్యలు
- గెలుపోటములపై విస్తృత చర్యలు

నాగర్‌కర్నూల్, మే 14 (నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 2018 ఎన్నికల్లో 62.33 శాతం పోలింగ్ జరగగా.. ఈసారి 7 శాతం అదనంగా ఓట్లు పోలయ్యాయి. పార్లమెంట్ పరిధిలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, గద్వాల, అలంపూర్, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ సెగ్మెంట్లలో మొత్తం 17,38,254 మంది ఓటర్లు ఉండగా.. 69.46 శాతంతో 12,07,469 మంది ఓట్లు పోలయ్యాయి. ఎండలు అధికంగా ఉండడంతో సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరిగింది. దీంతో పూర్తిస్థాయి పోలింగ్ శాతాన్ని అధికారులు మంగళవారం విడుదల చేశారు. దీని ప్రకారం గత పార్లమెంట్ ఎన్నికలకు మించి 7.13 శాతం పోలింగ్ పెరగడం గమనార్హం. 2018 పార్లమెంట్ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15,88,111 ఓటర్లు ఉండగా.. 62.33 శాతంతో 9,89,893 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, ఈ సారి జరిగిన పోలింగ్‌ను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. గద్వాలలో అత్యధికంగా 74.93 శాతం నమోదైంది. 2,56,637 మందికి గానూ 1,92,300 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో అత్యల్పంగా 65.11 శాతం పోలింగ్ జరిగింది. ఇక పోస్టల్ బ్యాలెట్ కూడా 85.95 శాతం నమోదైంది. 14,491 మందికి గానూ 12,455 మంది ఉద్యోగులు ఓట్లు వేశారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు వయోవృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్‌తోపాటు కొత్త ఓటర్లకు ఎన్నికల సంఘం అవగాహన కల్పించింది. ఇదిలా ఉండగా, గతానికి భిన్నంగా ఈసారి త్రిముఖ పోరు నెలకొన్నది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేశారు. ఊరూరా చేసిన ప్రచారానికితోడు ప్రజలు సైతం తమకు నచ్చిన అభ్యర్థిని గెలిపించేందుకు పోలింగ్ కేంద్రాలకు భారీ ఎత్తున చేరుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అయితే, పెరిగిన పోలింగ్ శాతంపై అభ్యర్థులు, రాజకీయ పార్టీ నేతలు, ప్రజలు గెలుపోటములపై అంచనాలు వేసుకొంటున్నారు. ఏయే ప్రాంతాల్లో ఎవరికి పోలింగ్ అనుకూలంగా వచ్చిందోనని ఆరా తీస్తున్నారు. కాగా, జూన్ 4న కౌంటింగ్ ఉండడంతో అప్పటి వరకు అభ్యర్థులు, నాయకులు ఎదురు చూడాల్సిందే.


### నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో అసెంబ్లీ వారీగా పోలింగ్

| నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | పురుషులు | మహిళలు | శాతం |
|---|---|---|---|---|---|
| గద్వాల | 2,56,637 | 1,92,300 | 96,334 | 95,958 | 74.93 |
| అలంపూర్ | 2,40,063 | 1,77,780 | 89,791 | 87,986 | 74.06 |
| కల్వకుర్తి | 2,44,405 | 1,77,226 | 90,995 | 86,230 | 72.51 |
| నాగర్‌కర్నూల్ | 2,36,094 | 1,60,394 | 81,821 | 78,572 | 67.94 |
| వనపర్తి | 2,73,863 | 1,82,552 | 92,232 | 90,320 | 66.66 |
| అచ్చంపేట | 2,47,729 | 1,61,301 | 81,715 | 79,583 | 65.11 |
| కొల్లాపూర్ | 2,39,463 | 1,55,917 | 80,197 | 75,718 | 65.11 |

### పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

| నియోజకవర్గం | పోస్టల్ బ్యాలెట్ | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| గద్వాల | 2,308 | 2,111 | 91.46 |
| వనపర్తి | 3,120 | 2,792 | 89.49 |
| అలంపూర్ | 1,943 | 1,676 | 86.26 |
| కొల్లాపూర్ | 1,490 | 1,249 | 83.83 |
| అచ్చంపేట | 1,975 | 1,646 | 83.34 |
| కల్వకుర్తి | 2,012 | 1,662 | 82.60 |
| నాగర్‌కర్నూల్ | 1,643 | 1,319 | 80.28 |






- స్ట్రాంగ్‌రూంలకు ఈవీఎం, వీవీ ప్యాట్లు
- జూన్ 4వ తేదీన ఫలితం వెల్లడి
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..
- అంచనాల్లో మునిగితేలుతున్న పార్టీలు

# తీర్పు నిక్షిప్తం

## "ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం"


నాగర్‌కర్నూల్ స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచిన ఈవీఎంలు

# ఓట్ల లెక్క తేలింది..

- పాలమూరులో 72.43 శాతం, నాగర్‌కర్నూల్‌లో 69.46 శాతం
- ప్రశాంతంగా ముగిసిన పార్లమెంట్ ఎన్నికలు
- సిబ్బందిని అభినందించిన ఆయా జిల్లాల కలెక్టర్లు

మహబూబ్‌నగర్, మే 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ సెగ్మెంట్లలో ఓటర్లు పోటెత్తడంతో భారీగా ఓటింగ్ నమోదైంది. ఎండ తీవ్రతకు భయపడి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు సాయంత్రం పరుగులు పెట్టారు. ఆరు గంటలలోపు ఉన్న వారిని ఓటేసేందుకు అనుమతి ఇవ్వడంతో కొన్ని నియోజకవర్గాల్లో సోమవారం రాత్రి వరకు పోలింగ్ జరిగింది. దీంతో అధికారులు పోలింగ్ శాతాన్ని మంగళవారం విడుదల చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 72.43 శాతం, నాగర్‌కర్నూల్‌లో 69.46 శాతం నమోదైంది. పోలింగ్ ముగిసిన తర్వాత అధికారులు ఈవీఎంలు, వీవీప్యాట్లను సీల్‌చేసి భారీ బందోబస్తు మధ్య డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు.. అక్కడి నుంచి స్ట్రాంగ్ రూంలకు తరలించారు. ఇదంతా పూర్తయ్యే వరకు అర్ధరాత్రి దాటిపోయింది. మహబూబ్‌నగర్‌కు సంబంధించిన ఈవీఎంలను పాలమూరు యూనివర్సిటీలో, నాగర్‌కర్నూల్‌కు చెందిన వాటిని నెలికొండ మార్కెట్ యార్డు గోదాంకు తరలించి సీల్ వేశారు. ప్రత్యేక పోలీసు దళాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. లోక్‌సభ రిటర్నింగ్ అధికారులు రవినాయక్, ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూంలకు చేరడంతో.. ఇక వచ్చేనెల 4వ తేదీన జరిగే కౌంటింగ్‌పై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లే కౌంటింగ్ కూడా ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇదిలా ఉండగా, మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో 16,82,470 ఓట్లకుగానూ 12,18,587 ఓట్లు పోలయ్యాయి. నాగర్‌కర్నూల్ పరిధిలో 17,38,254 ఓట్లకుగానూ 12,07,469 ఓట్లు పోలయ్యాయి. అయితే, మహబూబ్‌నగర్ సెగ్మెంట్ నుంచి 31, నాగర్‌కర్నూల్ నుంచి 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.


నాగర్‌కర్నూల్‌లో స్ట్రాంగ్‌రూంకు సీల్ వేస్తున్న అధికారులు

ఓటింగ్ శాతం పెరగడంతో ఆయా పార్టీల అంచనాలు తలకిందులవుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు.

**ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు..**

ఉమ్మడి జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అక్కడక్కడా చిన్నచిన్న ఘర్షణలు మినహా ఎక్కడా రీ పోలింగ్‌కు అవకాశం లేదు. ఆయా పార్టీల కార్యకర్తలు తోపులాటలకు దిగినా పోలీసులు సర్దిచెప్పారు. మహబూబ్‌నగర్‌లో ఒకచోట, నాగర్‌కర్నూల్‌లో రెండు చోట్ల ఎన్నికలను బహిష్కరించినా.. ఆయా పోలింగ్ కేంద్రాల్లో కొంతమంది ఓట్లు వేశారు. పోలింగ్ సజావుగా సాగడంతో కలెక్టర్లు, ఎస్పీలు ఎన్నికల సిబ్బందిని అభినందించారు.

**ఎవరి ధీమా వారిదే..**

లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలైన ఓట్లను ఆయా పార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఆయా నియోజకవర్గాల్లో తమకే లీడ్ వస్తుందని ధీమాలో ఉన్నారు. మరోవైపు స్వతంత్ర అభ్యర్థులు ప్రధాన పార్టీల వారిని ఢీకొనే స్థాయిలో లేకపోవడంతో రెండు లోక్‌సభ స్థానాల్లో కూడా ముక్కోణపు పోటీ ఏర్పడింది. ఎవరెన్ని అంచనాలు వేసినా ఓటరు తీర్పు జూన్ 4వ తేదీన వెల్లడి కానున్నది. మరి ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే.

### మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో అసెంబ్లీ వారీగా పోలింగ్

| నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | పురుషులు | మహిళలు | శాతం |
|---|---|---|---|---|---|
| జడ్చర్ల | 2,22,838 | 1,73,634 | 88,191 | 85,438 | 77.92 |
| షాద్‌నగర్ | 2,38,478 | 1,84,578 | 94,044 | 90,532 | 77.40 |
| దేవరకద్ర | 2,39,745 | 1,78,602 | 89,853 | 88,749 | 74.50 |
| మక్తల్ | 2,44,173 | 1,74,898 | 87,689 | 87,208 | 71.63 |
| కొడంగల్ | 2,41,794 | 1,71,776 | 85,555 | 86,220 | 71.04 |
| నారాయణపేట | 2,36,182 | 1,63,284 | 81,218 | 82,065 | 69.13 |
| మహబూబ్‌నగర్ | 2,59,260 | 1,71,815 | 86,374 | 85,435 | 66.27 |


తుంగభద్ర నదిలో తేలిన రాళ్లు, ఇసుక మేటలు

# తడారిన తుంగభద్ర

- నదిలో కరువైన నీటిజాడ
- తేలిన రాళ్లు, ఇసుక మేటలు
- గొంతెండుతున్న నదీతీర ప్రాంతాల పల్లెలు

అయిజ, మే 14 : తుంగభద్ర నది తడారింది. దాదాపు ఐదారునెలలుగా నీటి ప్రవాహం అడుగంటింది. నదిలో నీటిలభ్యత లేకుండా పోయింది. ప్రస్తుతం రాళ్లు తేలి ఎక్కడ చూసినా ఇసుక మేటలు కనిపిస్తూ నీటిజాడ కరువైంది. గతేడాది ఇదే సమయంలో నదిలో నీటి ప్రవాహం స్వల్పంగా ఉండేది. ఈ ఏడాది ఎగువ నుంచి వరద అంతంత మాత్రంగానే రావడంతో అక్టోబర్, నవంబర్ నెలలోనే ప్రవాహం నిలిచిపోయింది. ప్రస్తుతం నదిలో చుక్క నీరు కనిపించని దుస్థితి. దీంతో తీర ప్రాంత పల్లెల్లో గొంతెండుతున్నది. నీళ్ల కోసం ఖాళీ బిందెలు పట్టుకొని కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. మరికొందరు బైక్‌లు, సైకిళ్లపై తాళ్లతో బిందెలు కట్టుకొని నీటిని తెచ్చుకుంటున్నారు. తాగునీటి కోసం ప్రజలు అలమటిస్తున్నారు. కొందరైతే నదిలో చెలిమెల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. తెలంగాణ-ఏపీ సరిహద్దులోని నదిలో రెండు, మూడు కిలోమీటర్లు వెళ్లి.. సుమారు 2 గంటల పాటు నీటిని తోడి తెచ్చుకుంటున్నారు. ప్రజలతోపాటు పశుపక్షాదులకు సైతం నీటి కోసం తండ్లాడుతున్నాయి. గతేడాది వేసవిలో కనీసం అక్కడక్కడ ఏర్పడిన గుంతల్లో నీరు ఉండేదని, కానీ ప్రస్తుతం చుక్క నీరు కనిపించడం లేదు. వ్యవసాయ బోరు బావుల్లో సైతం భూగర్భ జలాలు అడుగంటి ఆశలన్నీ అడియాశలయ్యాయని రైతులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా తుంగభద్ర నది పరిస్థితి ఇలా చూడలేదని స్థానికులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గాకముందే తాగు నీటికి తల్లడిల్లే పరిస్థితులు వచ్చాయని పలువురు అంటున్నారు.


తుంగభద్ర నదిలో తేలిన రాళ్లు, రప్పలు


చెలిమె నుంచి నీటిని తోడుకుంటున్న దృశ్యం

# ఉసురు తీసిన 'బీరు' గొడవ

- వైన్స్‌షాపులో బీరు కావాలని అడిగిన యువకుడు
- ఇవ్వడంలో ఆలస్యమైనందుకు నిర్వాహకులతో వాగ్వాదం
- సదరు వ్యక్తిపై దుకాణంలో పిడిగుద్దులతో దాడి
- చికిత్స పొందుతూ మృతి
- దాడి చేసిన వారిని శిక్షించాలని కుటుంబసభ్యుల ఆందోళన

మూసాపేట (అడ్డాకుల), మే 14 : బీరు అడిగిన యువకుడిపై వైన్స్ షాపు నిర్వాహకులు దాడి చేయడంతో యువకుడు మృతి చెందాడు. స్థానికులు, బాధితుల కథనం మేరకు.. అడ్డాకుల మండలంలోని బలీద్‌పల్లి గ్రామానికి చెందిన ముష్టి శ్రీకాంత్ (26) గత నెల 26వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం శివారులోని బండమీదిపల్లిలో ఉన్న సాయి మల్లికార్జున వైన్స్ వద్దకు వెళ్లి బీర్లు కావాలని అడిగాడు. వైన్స్‌లో పనిచేసే వారు బీర్లు ఇవ్వకుండా మాట్లాడుకుంటున్నారు. దీంతో బీర్లు త్వరగా ఇవ్వాలని శ్రీకాంత్ అడిగినందుకుగానూ నిర్వాహకుల దురుసుతనంతో మాటామాటా పెరిగింది. వైన్స్ షాప్ కౌంటర్‌పై ఉన్న వ్యక్తి మరో పది మందితో కలిసి శ్రీకాంత్‌ను దుకాణంలోకి లాక్కెళ్లి పిడిగుద్దులతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను బంధువులు, స్నేహితులు వచ్చి స్వగ్రామానికి తీసుకెళ్లారు. కడుపులో నొప్పి రావడంతో శ్రీకాంత్‌ను కొత్తకోటలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. గొడవ విషయంపై అదేరోజు మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్‌కు తీసుకొచ్చారు. కాలేయం, కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్నాయని అక్కడి వైద్యులు చెప్పడంతో బాధిత కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు.

ఈ క్రమంలో శ్రీకాంత్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఇంత జరిగినా దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం జిల్లా దవాఖాన ఎదుట రోడ్డుపై మృతదేహంతో ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్ అక్కడికి చేరుకొని కుటుంబసభ్యులతో మాట్లాడారు. దాడి చేసిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

# కేసీఆర్ హయాంలోనే భగీరథుడికి గుర్తింపు

- నాడు అధికారికంగా జయంతి వేడుకల నిర్వహణ
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, మే 14 : కేసీఆర్ సర్కారు హయాంలోనే భగీరథ మహర్షికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, ప్రజల దాహార్తిని తీర్చే పథకానికి మిషన్ భగీరథ పేరు పెట్టామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న భగీరథుడి విగ్రహానికి జయంతి వేడుకల్లో భాగంగా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి పాలనలో మహనీయుల జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరినప్పటికీ పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత అధికారిక వేడుకలు నిర్వహించామన్నారు. జిల్లా కేంద్రంలో భగీరథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని సామాజిక వర్గాలకు ఆత్మగౌరవ భవనాలు, విగ్రహాల ఏర్పాటును కొనసాగించాలన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన వాటిని నిలిపివేయకుండా ఉండేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సగర కులస్తులకు ఆత్మగౌరవ భవనం నిర్మించేందుకుగానూ కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో రూ.200 కోట్ల విలువైన భూమిని కేటాయించామని గుర్తు చేశారు. ఆ స్థలంలో కళాశాల, హాస్టల్ భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రణీల్‌చందర్, రవికిషన్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.


భగీరథ మహర్షి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## యువత ఆదర్శంగా తీసుకోవాలి : నిరంజన్‌రెడ్డి


భగీరథ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, మే 14 : మహానుభావుల కృషిని యువత ఆదర్శంగా తీసుకొని అద్భుతాలు సృష్టించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్తకోట రోడ్డులో ఉన్న భగీరథ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ కృషికి, ప్రయత్నానికి భగీరథుడు మారుపేరని.. సంకల్పం ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. గంగను భువికి తీసుకొచ్చిన మహానుభావుడు భగీరథుడు అని పేర్కొన్నారు. గొప్ప గొప్ప వ్యక్తుల జీవితాలను అధ్యయనం చేసి వారి స్ఫూర్తితో అద్భుతాలు సృష్టించాలన్నారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య, నాయకులు సత్యంసాగర్, జనార్దన్, అంజి, మురళీసాగర్, శ్రీను, నాగేంద్రం, గోవర్ధన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకూ కృతజ్ఞతలు

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మక్తల్ టౌన్ మే 14 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా పనిచేసిన ప్రతి కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని తన స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించి దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను విస్మరించి.. తమ ఖజానా నింపుకొనేందుకు తహతహలాడుతున్నదన్నారు. కేవలం మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణాన్ని కల్పించి.. బస్సులను కుదించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో 9 సార్లు పర్యటించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే ఆరు గ్యారంటీలు అమలవుతాయని బూటకపు మాటలు చెప్పాడని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలు అమలుకాకపోవడంతో ప్రజలు ప్రభుత్వంపై విసుగు చెంది బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపారన్నారు. ప్రతి కార్యకర్త వెన్నంటే ఉంటానన్నారు.

## ప్రలోభాలకు తలొగ్గని నాయకులకు ధన్యవాదాలు

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



కొల్లాపూర్ రూరల్, మే 14 : అధికార పార్టీ ప్రలోభాలు, భౌతిక దాడులకు తలొగ్గకుండా బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విజయం కోసం నిరంతరం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో అడ్డదారిలో గెలిచేందుకు అధికార పార్టీ నేతలు ఎన్నికల నిబంధనలకు తూట్లు పొడిచారన్నారు. అమరగిరి చెంచుగూడెంలో ఎన్నికల ముందు నాలుగు రోజులపాటు కరెంట్ సరఫరా నిలిపివేయడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. కుట్రలు, కుతంత్రాలను ప్రజలు ఎక్కువ సార్లు నమ్మరని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేసి ఓట్లను అభ్యర్థించి ఉంటే బాగుండేదన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.